
బడిబాట కార్యక్రమంలో కార్పొరేటర్ రచనశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

కవాడిగూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాథమిక పాఠశాలల్లో చేర్పించాలని కార్పొరేటర్ జి. రచనశ్రీ పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. గురువారం ఏసీటీసీ కళాశాల వద్ద నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఐదేళ్లు దాటిన పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ టీచర్లు బడిబాట కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జె. స్వప్న, ధనమ్మ, కవిత, శారత, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శులు ఎ. ప్రభాకర్, కేశవ రాజు, యువమోర్చా అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

24 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గోల్నాక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన 24 మందికి చెక్కులు మంజూరయ్యాయి. గురువారం తులసినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ రూ. 9,10,000 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పులిజాల గెల్వయ్య, గండికోట జనార్దన్, కె.రామారావుయాదవ్, వై.బుచ్చిరెడ్డి, ఎన్.భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.


చిక్కడపల్లి బూడిద గల్లీలో స్థానికులను అడిగి
సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ రవిచారి

బూడిదగల్లీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

రాంనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి బూడిదగల్లీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ రవిచారి జలమండలి అధికారులకు సూచించారు. గురువారం జలమండలి బాగ్‌లింగంపల్లి సెక్షన్ మేనేజర్ జ్యోతి, సిబ్బందితో కలిసి బూడిదగల్లీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు ఆయన సూచించారు.

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న
చెట్ల కొమ్మలను తొలగించండి : కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులకు కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. గురువారం తిలక్‌నగర్‌లో ఓ ఇంటి వద్ద హైటెన్షన్ తీగలకు బాదం చెట్టు కొమ్మలు తగిలి షార్ట్ సర్క్యూట్ అవడంతో స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ ప్రాంతాన్ని సందర్శించారు. సంబంధిత శాఖ అధికారులను పిలిపించి చెట్లకొమ్మను సిబ్బందిచే నరికివేయించారు.

చిక్కడపల్లి లైబ్రరీ వద్ద పోలీసుల బందోబస్తు



చిక్కడపల్లి లైబ్రరీ వద్ద బందోబస్తులో ఉన్న పోలీసులు

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని, గ్రూప్-2 పరీక్షలు డిసెంబర్ వరకు వాయిదా వేయాలనే డిమాండ్‌తో నిరుద్యోగులు ఉద్యమిస్తున్న క్రమంలో గురువారం చిక్కడపల్లిలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అదనపు బలగాలు లైబ్రరీ వద్ద మొహరించాయి. ఆందోళన చేస్తే వారిని అదుపులోకి తీసుకొని తరలించడానికి వాహనాలను సైతం సిద్ధంగా ఉంచారు. నిరుద్యోగులు ప్రభుత్వ ప్రతినిధులతో గురువారం చర్చలు జరిపినట్లు తెలిసింది.

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న వీజీఆర్ నారగోని

బర్కత్‌పుర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజ్యాధికారాన్ని సాధించడమే లక్ష్యంగా ఉద్యమం చేపడుతున్నట్లు నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని తెలిపారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు ఏ రంగంలో కూడా ప్రాతినిధ్యం లేదని ఆరోపించారు. రాజకీయ అవగాహన పెంపొందించడానికి త్వరలో యాత్రలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ చైర్మన్‌ల నియామకాల్లో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్ ఎం.నర్సయ్య, ప్రతినిధులు ఎ. లక్ష్మణ్, బోయ గోపి, కేబీ శ్రీధర్, పాల్ తదితరులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ కాలనీలో చెత్త తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

బాగ్‌అంబర్‌పేటలో చెత్తకుప్పల తొలగింపు

నల్లకుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించాలని పారిశుధ్య కార్మికులను కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఎక్సైజ్ కాలనీ, పార్కు తదితర ప్రాంతాల్లో ఆమె పాదయాత్ర చేసి పేరుకుపోయిన చెత్త కుప్పలను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులను పిలిపించి వాటిని తొలగింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, గోవింద్ అర్జున్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బర్కత్‌పుర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్-ఉందానగర్ రైల్వే స్టేషన్‌ల మధ్య పట్టాల పక్కన సుమారు 40 ఏళ్ల వయస్సుగల గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది. వారం రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో
నాణ్యతా ప్రమాణాలను పాటించండి

ముషీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ సూచించారు. గురువారం ముషీరాబాద్ డివిజన్ శివాలయం చౌరస్తా సమీపంలో రూ. 9 లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

బర్కత్‌పుర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ చప్పల్‌బజార్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ డివిజన్ శివాలయం చౌరస్తాలో,
కాచిగూడ డివిజన్ చప్పల్ బజార్‌లో
డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న
కార్పొరేటర్లు సుప్రియా నవీన్‌గౌడ్, కన్నె ఉమాదేవి

రైతులకు రుణమాఫీ హర్షణీయం


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న
ఆరె మహేందర్, దశరథం తదితరులు

రాంనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టడం హర్షణీయమని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ అన్నారు. ఈ సందర్భంగా బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు దశరథం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంతోషం

బర్కత్‌పుర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్ అన్నారు. 2 లక్షల రుణమాఫీలో భాగంగా లక్ష రూపాయల మాఫీకి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. గురువారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ చేయనుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోకపోతే రైతులే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీమాన్‌గిరి, ఏనుగంటి దిలీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా..

చిక్కడపల్లి: రైతులకు రుణమాఫీపై తెలంగాణ జనసమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన టీజేఎస్ సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్‌మెరుగు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. చరిత్రలో నిలిచిపోయేలా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. సమావేశంలో టీజేఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్, ఎస్సీ సెల్ ముషీరాబాద్ కన్వీనర్ వెంకన్న, అజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ వేడుకలకు సీఎంకు ఆహ్వానం

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆగస్టు 18వ తేదీన గచ్చిబౌలిలో జరిగే 20వ శాంతి సరోవర్ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బ్రాహ్మకుమారీస్ తిలక్‌నగర్ శాఖ ప్రతినిధులు గురువారం సచివాలయంలో కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బ్రహ్మకుమారీస్ తిలక్‌నగర్ శాఖ ప్రతినిధులు అంజలి, షీల, వసంత, వంశీధర్, మాధవి, జనార్దన్, శ్రీలత తదితరులు ఉన్నారు.

\- నల్లకుంట, ఆంధ్రజ్యోతి



కుమార్తెపై తండ్రి అత్యాచారం

- బాలిక పక్కింటి వారికి చెప్పడంతో వెలుగులోకి
- నిందితుడి అరెస్టు

పీర్జాదిగూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కంచె చేను మేసినట్లు ఓ తండ్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న కన్న కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానవీయ ఘటన బుధవారం మేడిపల్లిలో జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తల్లి ఇంట్లో లేకపోవడంతో తనపై తండ్రి పాల్పడ్డ ఘోరాన్ని 12 ఏళ్ల బాలిక పక్కింటి మహిళకు చెప్పుకుంది. బాలిక చదువు కోసం ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటుండగా భర్తతో గొడవ పడ్డ ఆమె తల్లి ఇటీవలే పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో హాస్టల్‌లో ఉంటున్న కుమార్తెను తండ్రి రెండు రోజుల క్రితమే ఇంటికి తీసుకొచ్చాడు. ఒంటరిగా ఉన్న బాలికపై బుధవారం అత్యాచారానికి ఒడిగట్టాడు.

ఏం చేయాలో పాలుపోని ఆ బాలిక తండ్రి ఇంటి నుంచి బయటకు వెళ్లగానే పక్కింటి మహిళకు చెప్పింది. దీంతో వారు మేడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని విషయాన్ని నిర్ధారించుకున్నాక పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని గురువారం రిమాండ్‌కు తరలించారు.

'గృహ కార్మికులకు సమగ్రచట్టం తీసుకురావాలి'

బౌద్ధనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గృహ కార్మికుల కోసం సమగ్రచట్టం తీసుకురావాలని రాష్ట్ర గృహ కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం సాయంత్రం వారాసిగూడ రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం నిర్వహించారు. మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్ తెకనేత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గృహ కార్మికుల హక్కులను గుర్తించి, వాటిని పరిరక్షించడంతోపాటు హింస, వివక్షకు వ్యతిరేకంగా వారిని కాపాడేందుకు సమగ్ర చట్టం అవసరమన్నారు. కనీసం వేతనం రూ. 12 వేలు ఉండేలా చట్టం అమలుచేయాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు వల్లాల మంజుల మాట్లాడుతూ.. గృహ కార్మికుల పోరాటాలు, సాధించిన విజయాలు మహిళా ఉద్యమానికి, కార్మిక ప్రపంచానికి స్ఫూర్తిని స్తాయన్నారు. గృహ కార్మికుల హక్కులు, సాధన కోసం నిరంతరం పోరాడతామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సిస్టర్ లూర్ద్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సల్లావుద్దీన్, బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ, రిటైర్డ్ ఎఎల్ఓ రమణమూర్తి, అడ్మిన్ ఎస్ఐ సుధాకర్, ఇందిర, మాధురి, స్వర్ణ, ఆకాశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గరికపాటి ప్రవచనాలు

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆనంద్ గ్రూప్ ఆధ్వర్యంలో చేపట్టిన ధార్మిక కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుచే శ్రీ మద్భాగవత ప్రవచన ప్రసంగాల కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న కుచేలోపాఖ్యానము, 20న రుక్మిణీ కల్యాణం, 21న రుక్మిణీ కల్యాణ ఘట్టంపై ప్రసంగాలుంటాయని వివరించారు. డీడీ కాలనీ అహోబిలమఠంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు.

నారాయణగూడ వైఎంసీఏలో
డిస్కౌంట్‌పై బ్రాండెడ్ దుస్తుల విక్రయాలు

సికింద్రాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నారాయణగూడ వైఎంసీఏలో గురువారం నుంచి లగ్జరీ బ్రాండెడ్ దుస్తులను భారీ తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పురుషులు, మహిళలు, పిల్లలకు, పలు రకాల దుస్తులు లభిస్తాయని, కుట్టు కూలీ ధరలకే దుస్తులు విక్రయిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు విక్రయాలు కొనసాగుతాయన్నారు.

'యువత రాజకీయాల్లోకి రావాలి'

రాంనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన సామాజికవేత్త గడ్డం శ్రీధర్ టీడీపీలో చేరారు. ఆ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు గండికోట విజయ్, జి. ప్రవీణ్, కాతా విజయ్, వినోద్, ఎం. రాజు, మేడిపల్లి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమ న్యూస్ లెటర్‌ను ఆవిష్కరిస్తున్న ఇబ్రహీం అలీ సిద్దిఖీ తదితరులు

ఉర్దూ భాషలో టెక్నాలజీ సంబంధిత కోర్సులు

బంజారాహిల్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల విద్యార్థులు టెక్నాలజీని స్థానిక భాషల్లో నేర్చుకునేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీయూ) సంస్థ కృషి చేస్తుందని సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషన్ బోర్డు మెంబర్ జస్టిస్ ఇబ్రహీం అలీ సిద్దిఖి తెలిపారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో గురువారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్స్ ఇన్ ఉర్దూ అనే అంశంపై మూడురోజుల సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 20వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులో ఉర్దూ భాష పండితులతోపాటు ఉర్దూ భాష గురించి తెలిసిన మేధావులు టెక్నాలజీని ఉపయోగించి ఎక్కువ మందికి విషయ పరిజ్ఞానానికి ఉపయోగపడే అంశాలపై చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, ఎంబీఏ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీరావత్, డాక్టర్ అయేషానాజ్, సల్మా ఫౌజియా, మలిహానాజ్, రిజిస్ట్రార్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

'అర్చకుల బదిలీలను నిలిపేయాలి'

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో అధికారులు, సిబ్బందితోపాటు అర్చకుల బదిలీలకు జరుగుతున్న ప్రయత్నాన్ని నిలిపేయాలని భాగ్యనగర అర్చక పరిషత్ అధికారులకు విజ్ఞప్తి చేసింది. దైవాన్ని నమ్ముకుని దశాబ్దాలుగా ఒకేచోట పనిచేస్తున్న అర్చకులను బదిలీల పేరుతో మరో ప్రాంతానికి మార్చడం సరైంది కాదన్నారు. బదిలీలు నిలిపివేయడంతోపాటు వారికి పెన్షన్ ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అర్చకుల బదిలీ నిలిపివేత అంశంపై త్వరలోనే సీఎం, మంత్రితోపాటు దేవాదాయ శాఖ అధికారులను కలిసి విన్నవించనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు భాస్కరబట్ల రామశర్మ ఒక ప్రకటనలో తెలిపారు.


సమావేశాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎం. రాజశేఖర్ తదితరులు

ఆగస్టు 1, 2 తేదీల్లో
ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ సమావేశాలు

రాంనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) జాతీయ సమావేశాలను ఆగస్టు 1, 2 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలో గల ఓంకార్ భవన్‌లో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ జాతీయ కన్వీనర్ ఎం. రాజశేఖర్ తెలిపారు. మహాసభ వాల్‌పోస్టర్‌ను గురువారం బాగ్‌లింగంపల్లిలో ఆవిష్కరించారు. మహాసభలకు 18 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర బాలికల విభాగం కన్వీనర్ సావిత్రి, నాయకులు జబ్బార్ నాయక్, రమేష్, కుమార్, శ్రీకాంత్, విష్ణు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు సమయపాలన పాటించాలి : సీఐ


సీఐకి పుష్పగుచ్ఛం
అందజేస్తున్న వ్యాపారులు

రాంనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యాపారులు సమయపాలన పాటించాలని, లేకపోతే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని సీఐ రాంబాబు హెచ్చరించారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను గురువారం రాంనగర్‌కు చెందిన వ్యాపారులు మహ్మద్ అబ్దుల్ ఫారుఖ్ గౌస్, ఎం.ఎ. వహేద్ అలీ, గౌస్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వ్యాపారులు రాత్రి 10 గంటల లోపు షాపులను మూసివేయాలని సూచించారు.

'కొత్తబజార్ రోడ్డును పునర్‌నిర్మించాలి'

కవాడిగూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుంతలయమైన కొత్తబజార్ ప్రధాన రహదారిని పునర్‌నిర్మించాలని కాంగ్రెస్ నాయకుడు, సోషల్ వర్కర్ ప్రవీణ్ కోరారు. గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతి పత్రం అందజేశారు. గుంతలమయమైన రోడ్డుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వర్షం వచ్చినప్పుడు నీరు నిలుస్తోందని, వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. సమస్య గురించి ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

రైల్వేసర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

బర్కత్‌పుర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే సర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల కార్యవర్గాన్ని రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కాచిగూడలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు అన్నారెడ్డి జైపాల్‌రెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బురుగు మోహన్‌రెడ్డి, కోశాధికారిగా మారంరెడ్డి విష్ణుభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గుంటి కుమారస్వామిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులుగా సి. మధుసూదన్, ధూళిమూడి కృష్ణమోహన్, నాంపల్లి అనురాధ ఎన్నికయ్యారన్నారు. కార్యవర్గం రెండేళ్లపాటు కొనసాగుతుందన్నారు.

హైదరాబాద్- వాడి మార్గంలో ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్- వాడి- హైదరాబాద్ మార్గంలో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్- వాడి స్పెషల్ (రైల్ నం: 07175) ఈనెల 20వ తేదీ ఉదయం 10.05గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, మధ్యాహ్నం 3.30గంటలకు వాడి చేరుతుంది. వాడి-హైదరాబాద్ స్పెషల్ (రైల్ నం: 07176) ఈనెల 20 సాయంత్రం 4.20 గంటలకు వాడి నుంచి బయల్దేరి, రాత్రి 9.20 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. హైదరాబాద్- వాడి స్పెషల్ (రైల్ నం: 07177) ఈనెల 22 ఉదయం 5 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, 10.15 గంటలకు వాడి చేరుతుంది. వాడి-హైదరాబాద్ స్పెషల్ (రైల్ నం: 07178) ఈనెల 22న ఉదయం 11.05 గంటలకు వాడి నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

రెండు రైళ్లు పాక్షికంగా రద్దు

ఈనెల 21న జైపూర్ నుంచి బయల్దేరే జైపూర్- హైదరాబాద్ (నం: 07116) రైలును జైపూర్- అజ్మీర్ మధ్య రద్దు చేశారు. ఈనెల 19న హైదరాబాద్ నుంచి బయల్దేరే హైదరాబాద్- జైపూర్ (నం: 07115) రైలును అజ్మీర్- జైపూర్ మధ్య రద్దు చేశారు.

ముస్లింలపై యూపీ సర్కార్ వివక్ష

- అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం

హైదరాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ముస్లింల పట్ల వివక్ష చూపుతున్నదని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ముజఫర్‌నగర్‌లో నిర్వహించనున్న కన్వర్ యాత్ర మార్గంలో రోడ్ సైడ్ స్టాల్స్, ఫుడ్‌స్టాల్స్ బోర్డులపై యజమానుల పేర్లను ప్రకటించాలని పోలీసులు ఆదేశాలు జారీ చేయడం అంటే రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. గురువారం దారుల్‌సలాం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యవహారం పరిశీలిస్తే ఆయనను హిట్లర్ ఆవహించినట్టుగా ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో పోలీసుల చర్యతో ముజఫర్‌నగర్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనైతిక, వివక్షత చర్యలను వ్యతిరేకించడం నేరం కాదని, రెండు సమాజాల మధ్య ఘర్షణలకు కారణమైన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. పోలీసు నిబంధనల కారణంగా ముజఫర్‌నగర్‌లోని అన్ని దుకాణాల నుంచి ముస్లిం ఉద్యోగులు ఉద్వాసనకు గురయ్యారని పేర్కొన్నారు. ఈ చర్యలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 17ను ఉల్లంఘించినట్టు పరిగణిస్తామన్నారు.

ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం

సరూర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను లోబరచుకున్న ఓ యువకుడు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బడంగ్‌పేట్‌లో నివసిస్తోంది. బడంగ్‌పేట్‌కు చెందిన యువకుడు పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. యువకుడు, బాలిక కుటుంబాలు ఒకే అపార్ట్‌మెంట్‌లో వేర్వేరు ఫ్లాట్లలో అద్దెకు ఉంటున్నాయి. ఈ క్రమంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. దానిని అవకాశంగా తీసుకున్న యువకుడు బాలికను ప్రేమ పేరుతో లోబరచుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఇటీవల అస్వస్థతకు గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్లగా గర్భవతి అని తేలింది. తల్లిదండ్రులు నిలదీయగా.. బాలిక జరిగిన విషయం చెప్పింది. బాలిక కుటుంబ సభ్యులు మీర్‌పేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.